సాక్షి వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



ఆపసోపాలు!

సీఎం చంద్రబాబు ఏక్ నంబరీ అయితే.. ఆయన ఎమ్మెల్యేలు దస్ నంబరీలా తయారయ్యారు. తిమ్మిని బమ్మిని చేయడంలో తమకు మించిన వారు లేరని నిరూపించుకుంటున్నారు. -8లో

విద్యుద్దీపాలంకరణలో గఫారియా దర్గా



మజార్ల వద్ద ఫాతెహా చేస్తున్న భక్తులు



ఘనంగా గంధోత్సవం

భక్తులతో కిటకిటలాడిన దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా

కమలాపురం: కమలాపురంలో పట్టణంలో వెలసిన హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజరత్ దస్తగిర్ షా ఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వీ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఖుద్దస సిర్రహుం వార్ల గంధోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం రాత్రి దర్గా పీఠాధిపతి (ముతవల్లి) సజ్జాద్–ఏ–నషీన్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో దర్గా కన్వీనర్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో గంధోత్సవం జరిగింది. పీఠాధిపతి నివాసం నుంచి గంధం సామగ్రిని బస్టాండు సమీపంలోని గంధం ఇంటికి మేళా తాళాలతో తీసుకువచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినీలో గంధాన్ని ఊరేగించారు. ఊరేగింపులో బాణసంచా,డప్పు వాయిద్యాలు, ఫకీర్ల విన్యాసాలు అలరించాయి. పీఠాధిపతి దర్గాలోని స్వామి వార్ల మజార్లపై పూల చాదర్ సమర్పించి గంధం ఎక్కించారు.

- దర్గా మైదానంలో ఏర్పాటు చేసిన ఖవ్వాలీ పోటీ అలరించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఢిల్లీకి చెందిన ఖుత్బీ బ్రదర్స్, యూపీ కి చెందిన సర్ఫరాజ్ అన్వర్ సాబిరి ల మధ్య ఖవ్వాలీ పోటీ సాగింది. ఖవ్వాలీ ప్రియులు ఆద్యంతం ఆస్వాదించారు.

కదిలింది.. కోదండ రాముని రథం



- వైభవంగా బ్రహ్మోత్సవాలు
- రామనామ స్మరణతో మార్మోగిన ఒంటిమిట్ట
- తరలివచ్చిన అశేష భక్తజనం

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి వారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఏడో రోజైన శనివారం స్వామి వారి రథోత్సవం తహసీల్దార్ వెంకట రమణమ్మ చేతుల మీదుగా డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండ రాములవారు రథాన్ని అధిష్టించి గ్రామవీధుల్లో విహరించారు. భజన బృందాల చెక్క భజనలు, కోలాటాలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కాయకర్పూర నిరాజనాలు అందించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలించారు. రథోత్సవాన్ని కనులారా వీక్షించి తరించారు. శ్రీరామ నామస్మరణతో ఏకశిలా నగరం మార్మోగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకటయ్య చౌదరి, జేఈఓ వి.వీరబ్రహ్మం, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఇంజినీరింగ్ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి శారథి, మనుసు పగ్గం, ఇంద్రియాలే గుర్రాళ్లు, విషయాలే విధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూల శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మనాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్వజ్ఞాన మిదే.

నేడు..

శ్రీరాముడి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన ఆదివారం ఉదయం 8 గంటలకు కాళీయమర్ధన అలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ జరుగుతుంది. అనంతరం రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై ఊరేగింపు వైభవంగా నిర్వహిస్తారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ పీఏసీలో జిల్లా నేతలకు చోటు



వైఎస్ అవినాష్‌రెడ్డి



ఎస్‌బీ అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీలో జిల్లా నేతలకు చోటు కల్పించారు. కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషాలకు ఇందులో చోటు కల్పించారు. పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పీఏసీ కన్వీనర్‌గా ఉండే ఈ కమిటీలో 33 మంది సభ్యులుగా ఉన్నారు.

సమష్టి కృషితోనే విజయవంతం

కడప అర్బన్: ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రముఖ ఘట్టమైన కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరగడంపై జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సమష్టి కృషితోనే కల్యాణ ఘట్టం విజయవంతంగా ముగిసిందని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి చిన్న ఘటనకు తావులేకుండా చూసిన పోలీస్ అధికారులు, సిబ్బంది, ఏపీఎస్పీ, సివిల్, ఏఆర్, ఇతర జిల్లాల నుంచి వచ్చిన సిబ్బంది, జిల్లాలోని ఇతర విభాగాల సిబ్బందికి అభినందనలు తెలిపారు. పోలీస్ శాఖకు సహకరించిన ఇతర శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మెడికల్ ఎంప్లాయిస్ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు కడప నబీకోటలోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్రీనివాసులురెడ్డి, ఎస్ ఎండీ మహబూబ్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్‌రావు, నాయకులు టీడీకే సాగర్, జంబారపు అహరోన్, ఎస్. బాబా సాహెబ్‌లతోపాటు అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాశాఖల అధ్యక్ష, కార్యదర్శులు హాజరు కానున్నారన్నారు. జిల్లాలోని యూనియన్‌కు చెందిన నాయకులు, ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

ఇంటర్ ఫలితాల్లో
బాలికలదే హవా!

- ఫస్టియర్‌లో 21, సెకండియర్‌లో 22వ స్థానం
- ఫస్ట్ ఇయర్‌లో 61 శాతం, సెకండియర్‌లో 75 శాతం ఉత్తీర్ణత



కడప ఎడ్యుకేషన్: ఇంటర్ ఫలితాల్లో మరోసారి బాలికలు సత్తా చాటారు. శనివారం విడుదలైన ఫలితాల్లో బాలురపై బాలికలదే పైచేయిగా నిలిచింది. ఇక ప్రథమ సంవత్సరానికి సంబంధించి 61 శాతం ఉత్తీర్ణతతో వైఎస్సార్ జిల్లా రాష్ట్రంలో 21వ స్థానంలో నిలవగా.. సెకండియర్‌లో 75 శాతం ఉత్తీర్ణతతో 22వ స్థానంలో నిలిచింది. ఫలితాల పరంగా గతేడాది కంటే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం మెరుగుపడి జిల్లా ర్యాంకు కాస్త మెరుగైంది. గతేడాది ఫస్టియర్‌లో 55 శాతం, సెకండియర్లో 69 శాతం ఉత్తీర్ణత జిల్లా 24వ స్థానంలో నిలిచింది.

- జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. ఇందులో ప్రథమ సంవత్సరం సంబంధించి 15301 మంది జనరల్, 1333మంది ఒకేషనల్ పరీక్షలను రాశారు. అలాగే ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 12878 మంది జనరల్, 1182 మంది ఒకేషనల్ పరీక్షలను రాశారు.

ప్రథమ సంవత్సరానికి సంబంధించి...

ఈ ఏడాది నిర్వహించిన ప్రథమ సంవత్సర ఇంటర్ ప రీక్షలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 9295 మంది పాసై 61 శాతం మేర ఉత్తీర్ణతను సాధించారు. ఇందులో బాలురు 3795 మంది పాసై 54 శాతం, బాలికలు 5500 మంది పాసై 66 శాతం మేర ఉత్తీర్ణతను సాధించారు.

ద్వితీయ సంవత్సరానికి సంబంధించి..

ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది 12,878 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఇందులో 9688 మంది పాసై 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 4005 మంది పాసై 70 శాతం, బాలికలు 5683 మంది పాసై 80 శాతం మేర ఉత్తీర్ణతను సాధించడం విశేషం.

100శాతం ఫెయిల్

కమలాపురం: కమలాపురం జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో కొనసాగుతున్న హైస్కూల్ ప్లస్ విద్యార్థులు 100 శాతం ఫెయిల్ అయ్యారు. జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో కొనసాగుతున్న హైస్కూల్ ప్లస్‌లో ఫస్టియర్‌కు చెందిన 33 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు ప్రిన్సిపల్ ఖజాపర్వీన్ తెలిపారు. కాగా సెకండియర్‌లో 14 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో ఇద్దరు ఉత్తీర్ణత సాధించారని ఆమె వివరించారు. కాగా ఫస్టియర్‌కు చెందిన విద్యార్థులందరూ ఫెయిల్ అయిన విషయంపై ప్రిన్సిపల్‌ను వివరణ కోరగా తాము అన్ని పాఠ్యాంశాలు బోధించడంతో పాటు స్టడీ అవర్స్ నిర్వహించామన్నారు. ఇలా ఎలా జరిగిందో ఉపాధ్యాయులతో రివ్యూ చేస్తామని వివరించారు.

ఫలితాలు సంతృప్తికరం



ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాం. ఫలితాలు పరంగా గతేడాది కంటే ఈ సారి మెరుగయ్యాం. రాబోయే ఏడాదిలో మరింత మెరుగైన ఫలితాలు రాబడతాం.

– బండి వెంకటసుబ్బయ్య,ఆర్‌ఐవో, ఇంటర్మీడియట్.

ప్రథమ సంవత్సరానికి సంబంధించిన ఫలితాల వివరాలు ఇలా..

కేటగిరీ	కాలేజీలు	హాజరు	పాస్	ఉత్తీర్ణత శాతం
ప్రభుత్వ	20	2171	1072	49
ఎయిడెడ్	05	293	50	17
హైస్కూల్‌ప్లస్	14	235	52	22
మోడల్ స్కూల్స్	03	210	107	51
ఏపీఎస్‌డబ్లూఆర్	11	604	517	86
కేజీబీవీ	16	508	345	68
ప్రైవేటు	71	11280	7152	63
మొత్తం	140	15301	9295	61

ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఫలితాలు ఇలా...

కేటగిరీ	కాలేజీలు	హాజరు	పాస్	ఉత్తీర్ణత శాతం
ప్రభుత్వ	20	1640	1149	70
ఎయిడెడ్	05	230	96	42
హైస్కూల్‌ప్లస్	09	131	55	42
మోడల్ స్కూల్స్	03	138	105	76
ఏపీఎస్‌డబ్లూఆర్	11	509	470	92
కేజీబీవీ	16	335	273	81
ప్రైవేటు	71	9895	7540	76
మొత్తం	135	12878	9688	75

ఇంటర్ ఐదేళ్ల ఫలితాల వివరాలు

సంవత్సరం		హాజరు	పాస్	ఉత్తీర్ణతశాతం
2021	ప్రథమ	26100	26100	100
	ద్వితీయ	23461	23100	100
2022	ప్రథమ	21108	8608	41
	ద్వితీయ	21468	10630	50
2023	ప్రథమ	18839	8603	46
	ద్వితీయ	17056	10230	60
2024	ప్రథమ	14470	7954	55
	ద్వితీయ	12131	8375	69
2025	ప్రథమ	15301	9295	61
	ద్వితీయ	12878	9688	75

టీమిండియాకు శ్రీచరణి ఎంపిక గర్వకారణం

- మహిళా క్రికెట్‌ను ఏసీఏ ప్రోత్సహిస్తోంది
- ఇందుకు శ్రీ చరణియే ఆదర్శం
- జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. భరత్ రెడ్డి, కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్



శ్రీచరణిని సన్మానిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా కు చెందిన ఎస్.శ్రీ చరణి భారత సీనియర్ మహిళా క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.భరత్ రెడ్డి, కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్ పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి శ్రీలంకలోని కొలంబియాలో ప్రారంభమయ్యే ట్రై నేషన్స్ వన్డే సిరీస్‌లో పాల్గొనే భారత సీనియర్ మహిళ క్రికెట్ జట్టుకు ఎంపికైన ఎస్.శ్రీ చరణికి శనివారం మధ్యాహ్నం కడపలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ స్టేడియంలో కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భరత్ రెడ్డి, ఎ.రెడ్డి ప్రసాద్, అసోసియేషన్ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా భరత్ రెడ్డి, రెడ్డిప్రసాద్ మాట్లాడుతూ మహిళ క్రికెట్‌ను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ), అలాగే జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎంతగానో ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని వైఎస్సార్ కడప జిల్లా మహిళా క్రికెటర్లు సద్వినియోగం చేసుకొని శ్రీ చరణి వలె మంచి ప్రతిభ కనబరచి ఇండియా జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అలాగే శ్రీ చరణి మంచి ప్రతిభ కనబరచి భారత దేశానికి, ఇండియన్ మహిళా క్రికెట్‌కు, వైయస్సార్ కడప జిల్లాకు, ఏసీఏకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీ చరణి మాట్లాడుతూ తను భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపిక కావడంపై గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. తాను ఇంతటి స్థాయికి చేరుకునేందుకు జిల్లా సీనియర్ క్రికెటర్లు ఎం. సురేష్, ఖాజా మైనుద్దీన్, తన తండ్రి చంద్రశేఖర్ రెడ్డి, మేనమామ కిషోర్ కుమార్ రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కృషి, ప్రోత్సాహం ఎంతగానో ఉందన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి. నాగేష్ కుమార్ రాజు, సంయుక్త కార్యదర్శి ఎం.సాయి పృథ్వితేజ, కోశాధికారి ఎం. మహేంద్ర రెడ్డి, షేక్ సిరాజుద్దీన్ దౌలా, ఎస్ మౌనిక, సభ్యులు పి. సంజయ్ కుమార్ రెడ్డి, వై. విష్ణు ప్రీతం రెడ్డి, ఎల్. మునికుమార్ రెడ్డి, ఎస్. ఖాజామైనుద్దీన్, ఎం.శ్రీకాంత్ రెడ్డి, వై. శివప్రసాద్, ఎం. సురేష్, పి.విజయ్ కుమార్, కె. విష్ణుమోహన్ రావు, అకాడమీ సిబ్బంది,కోచ్‌లు పాల్గొన్నారు.

కాయ..కష్టం.. నేలపాలు!



ఇతని పేరు మధుసూదన్‌రెడ్డి. చక్రాయపేట మండలం సురభి గ్రామం. 20 ఎకరాల్లో మామిడిని సాగు చేశాడు. ఈ ఏడాది మామిడి తోటకు దోమపడి పూత బాగా తగ్గింది. దాని నివారణకు దాదాపు ఆరు లక్షల రుపాయలు ఖర్చు చేసి మందులు పిచికారి చేశాడు. ఫలితం లేదు. పెట్టుబడులు కూడా వచ్చేలా లేదని దిగాలు పడుతున్నాడు. జిల్లాలో చాలా మంది రైతుల పరిస్థితి దయనీయంగానే ఉంది.

- ఎండలు, తెగుళ్లతో రాలిపోయిన మామిడి పూత
- అధిక ఉష్ణోగ్రతలే కారణమంటున్న శాస్త్రవేత్తలు
- ఈ ఏడాది భారీగా తగ్గనున్న మామిడి దిగుబడులు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నల వినతి



అంతగా పూతలేని మామిడిచెట్లు

కడప అగ్రికల్చర్/చక్రాయపేట: ఈ ఏడాది మామిడి రైతులు ఆశలు అడియాసలయ్యాయి. మొదట్లో మామిడి చెట్లకు పూత బాగానే ఉన్నా ఎండల తీవ్రత పెరగడంతో తెగుళ్ల సోకి చెట్లకున్న పూతంత రాలిపోయింది. పైగా అక్కడక్కడ పిందలు కూడా నేల రాలిపోతున్నాయని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వారి ఆశలు కుప్పకూలి పోయాయి. మామిడికి తెగుళ్ల తీవ్రత అధికంగా ఉండటంతో వేలకు వేలు ఖర్చు పెట్టి పురుగుమందులను పిచికారి చేసినా ఫలితం లేకుండా పోయిందని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాలకు 80 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చు వచ్చిందని కానీ దిగుబడి చూస్తే వేలల్లో కూడా వచ్చేలా లేదని మామిడి రైతులు ఆందోళనలు చెందుతున్నారు.

జిల్లాలో 9642 ఎకరాల్లో...

జిల్లావ్యాప్తంగా 9642 ఎకరాల్లో మామిడి పంట సాగులో ఉంది. ఇందులో అత్యధికంగా చక్రాయపేట మండలంలో 3498.48 ఎకరాల్లో సాగులో ఉండగా సిద్దవటంలో 1744.25 ఎకరాల్లో, వేంపల్లిలో 680 ఎకరాల్లో, సీకేదిన్నె మండలంలో 356 ఎకరాల్లో ఇలా జిల్లావ్యాప్తంగా 35 మండలాల్లో కలిపి 9642 ఎకరాల్లో మామిడి పంట సాగులో ఉంది. వాతావరణ మార్పులతోపాటు రోజురోజుకు ఎండల తీవ్రత పెరగడంతో తెగుళ్ల బెడద అధికమయింది. ముఖ్యంగా పేనుబంక తెగులు అధికంగా ఉంది. వాటికి మందులు వాడినా ఫలితం అంతగా లేదని రైతులు తెలిపారు. ఎండలు తీవ్రత పెరిగే కొద్ది క్రమేపి పూత రాలి పోయిందని పలువురు రైతులు బాధ వ్యక్తం చేశారు.


ప్రభుత్వమే ఆదుకోవాలి



ఈ ఏడాది వాతావరణ మార్పులతోపాటు ఎండల తీవ్రతతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.ఎకరాలకు 70 నుంచి 80 వేల దాకా పెట్టుబడులు పెట్టా. తీరా దిగుబడి చూస్తేనేమో అంత పరిస్థితి లేదు. చేసిన అప్పులు కూడా తీరే పరిస్థితి లేదు. మామిడి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– మల్లికార్జున, కుప్పకూటపల్లె, చక్రాయపేట మండలం.

ఉన్నపంటను కాపాడుకోవాలి



ఎండల తీవ్రతతో రాలిపోగా మిగిలిన పూత, పిందెలను కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. సకాలంలో చెట్టుకు నీటి తడులు అందించడంతోపాటు సత్తువలను సకాలంలో అందించాలి.

– డాక్టర్ వీరయ్య, సీనియర్ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఉటకూరు

క్లుప్తంగా

చేబ్రోలు కిరణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి


వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు

వేంపల్లె : చేబ్రోలు కిరణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వేంపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు పేర్కొన్నారు. శనివారం స్థానిక వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 9వ తేదీన చేబ్రోలు కిరణ్ అనే ఐటీడీపీ కార్యకర్త, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్ రెడ్డి సతీమణి వైయస్ భారతి గురించి నీచాతి నీచంగా మాట్లాడం దారుణమన్నారు. అతను మాట్లాడిన తీరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉందన్నారు.

పొలాల్లో స్టార్టర్ల వైర్ చోరీ


స్టార్టర్ వైర్‌ను కత్తిరించిన దుండగులు

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లె గ్రామ పొలాల్లో 15 వ్యవసాయ బోర్లకు చెందిన స్టార్టర్లు, సర్వీస్ వైర్లను దుండగులు చోరీ చేశారు. శనివారం ఉదయం రైతులు మోటార్ ఆన్ చేసేందుకు పొలాల వద్దకు వెళ్లి చూడగా స్టార్టర్ వైర్లు, సర్వీస్ వైర్లు లేకపోవడం గమనించారు. పరిసర పొలాల్లోని 15 బోర్లకు సంబంధించిన స్టార్టర్లు, సర్వీస్ వైర్‌ను శుక్రవారం రాత్రి దుండగులు ఎత్తుకెళ్లినట్లు రైతులు గుర్తించారు. గ్రామానికి చెందిన భూమిరెడ్డి పెద్ద వెంకటసుబ్బయ్య, దండు చిన్న మునెయ్య, దాసరి వెంకటసుబ్బయ్య, నడిపి సుబ్బన్న, చిన్న సుబ్బన్న, పుల్లారెడ్డి గారి శివ, రమేష్, వెంకటసుబ్బయ్య, భూమిరెడ్డి వెంకటసుబ్బయ్య, భూమిరెడ్డి నారయ్య తదితర రైతులకు చెందిన వైర్లు చోరీకి గురయ్యాయి. ఈ వైర్ల విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని రైతులు తెలిపారు. వైర్లు చోరీకి గురైన పొలాల్లో అరటి, మిరప తదితర పంటలు సాగు చేశారు. పొలాలకు నీరు కట్టేందుకు వైర్ల చోరీతో ఆటంకం కలగడమే కాక పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టార్టర్లు, సర్వీస్ వైర్ల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు బాధిత రైతులు తెలిపారు.

ఆపసోపాలు!

- సొంత డబ్బులతో బ్రిడ్జి నిర్మిస్తామని ఎన్నికల ముందు ప్రగల్భాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 6 పనులకు రూ.305.51 కోట్లు విడుదల
- ఎన్నికల కోడ్‌తో రవీంద్రనగర్‌లో నిలిచిపోయిన లోలెవెల్ కాజ్‌వేలు
- ఆ పనులు రద్దు చేయించి, కొత్తగా ఉత్తర్వులు తీసుకువచ్చిన ఎమ్మెల్యే
- కడపకు కొత్తగా నిధులు తీసుకురాకపోగా చీప్‌ట్రిక్స్

సాక్షి ప్రతినిధి, కడప : ముఖ్యమంత్రి చంద్రబాబు ఏక్ నంబరీ అయితే.. ఆయన ఎమ్మెల్యేలు దస్ నంబరీలా తయారయ్యారు. తిమ్మిని బమ్మిని చేయడంలో తమకు మించిన వారు లేరని నిరూపించుకుంటున్నారు. కడపలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేయించిన అభివృద్ధి పనులను రద్దు చేయించి.. మళ్లీ అవే పనులను తాము మంజూరు చేయించామంటూ గొప్పలకు పోతున్నారు. ఎన్నికలు పూర్తి అయిన నెలలోపు సొంత డబ్బులతో రవీంద్రనగర్‌కు వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణాలు చేపడతామని ప్రకటించారు. ఏడాది కావస్తున్నా చేసిందేమీ లేదని ప్రజలు నిలదీస్తుండటంతో కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి తిరకాసు ఉత్తర్వులు తీసుకువచ్చారు.

కడప నగరంలో వివిధ రహదారుల అభివృద్ధి, వంతెనల నిర్మాణం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా జీఓ ఆర్టీ నెంబర్ 400 ద్వారా రూ.305.51 కోట్లు మంజూరు చేస్తూ 2023 జూన్ 16న ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం ఆరు పనులకు గాను 4 పనులు పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్ కారణంగా రవీంద్రనగర్ ప్రాంతంలో రెండు లోలెవెల్ కాజ్‌వేల నిర్మాణం, మేజర్ స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ సిస్టమ్ పనులు నిలిచిపోయాయి. 2024 ఎన్నికల సందర్భంగా కడప ఎమ్మెల్యేగా పోటీ చేసిన మాధవిరెడ్డి ఈ పనులను తామే తమ సొంత నిధులతో చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన 15 రోజులలో పనులు ప్రారంభిస్తామని నెలరోజుల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఏడాది గడుస్తున్నా ఆ పనుల ఊసే ఎత్తలేదు. ఈ విషయమై ప్రజలు నిలదీస్తుండటంతో తిమ్మిని బమ్మిని చేసే పనిలో పడ్డారు.

మంజూరైన పనులు రద్దు.. ఆపై అవే పనులకు ఉత్తర్వులు

నగరంలోని పలు రోడ్ల విస్తరణ, కూడళ్ల అభివృద్ధి, వంతెనల నిర్మాణం పనులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా 2023 జూన్ 16వ తేదీన జీఓ ఇచ్చారు. వెంటనే పనులు ప్రారంభించారు. 6 పనులకు గాను 4 పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మిగిలిన 2 పనులను పూర్తి చేయాల్సి ఉంది. కాగా వాటిని రద్దు చేయించారు.


కడపలోని బుగ్గవంక కాలువ

వైఎస్సార్‌సీపీ పార్టీకి ఆ ప్రభుత్వానికి పేరు రాకూడదనే ఉద్దేశంతో వాటిని రద్దు చేయించిన ఎమ్మెల్యే, తానేదో కడపకు మేలు చేస్తున్నట్లు రద్దు చేసిన అవే పనులను జీఓ ఆర్టీ 285 ఏప్రిల్ 7న మళ్లీ మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆపై విపరీతమైన ప్రచారం చేసుకుంటున్నారు. ఏడాది అయినా ఒక్క పైసా కడప నగరానికి తీసుకు రాక పోగా..ఇలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసి..టెండర్లు కూడా పూర్తి చేసిన పనులను మళ్లీ కొత్తగా ఉత్తర్వులు తీసుకొచ్చి తానేదో మేలు చేసినట్లు చెప్పుకోవడం విచిత్రంగా ఉందని పలువురు కార్పొరేటర్లు అంటున్నారు.

● ఆనాడే నిధులు విడుదల..

మేజర్ స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ సిస్టమ్ పనులకు రూ.70 కోట్లు, రవీంద్రనగర్‌లో బుగ్గవంకపై రెండు వంతెనలకు రూ.20 కోట్లను ఆనాడే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులు సత్వరమే పూర్తి చేయించే చర్యలు చేపట్టకపోగా, అంతా తామే చేశామని చెప్పుకోవడంలో కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి చంద్రబాబును మించిపోయారని పలువురు ఆరోపిస్తున్నారు.

రూ.20కోట్లకు మించి ఒక్క రూపాయి అదనంగా తీసుకురాలేదు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బుగ్గవంకపై రెండు బ్రిడ్జిలకు రూ.20కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు టెండర్లు, ఎంఓయూ, అగ్రిమెంటు కూడా పూర్తయ్యాయి. అవి పూర్తి చేయించకపోగా ఉన్న పనులు రద్దు చేయించారు. అవే పనులకు ఎమ్మెల్యే మాధవిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డిలు అవే రూ.20కోట్లకు ఇంకో జీఓ తెచ్చి ఆ పనులు తామే చేయిస్తామని చెప్పుకోవడం హాస్యాస్పదం. అప్పట్లో మంజూరైన రూ.20కోట్లకు అదనంగా ఒక్క రూపాయి కూడా కడపకు తీసుకురాలేదు. దీనికి వారు తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గు చేటు.

– వి. రామక్రిష్టారెడ్డి, 44వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి.

బుగ్గవంక అప్రోచ్ రోడ్డు పనులు కూడా పూర్తి చేయాలి..



బుగ్గవంక రక్షణ గోడ వెంబడి 40 అడుగుల అప్రోచ్ రోడ్లు కూడా పూర్తి చేయాలి. పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయించి అభివృద్ధికి పాటు పడితే ప్రజలు మెచ్చుకుంటారు. అలా కాకుండా మంజూరైన పనులు రద్దు చేయించి ఆపై మళ్లీ కొత్తగా మంజూరు చేసినట్లు అవే పనులకు ఉత్తర్వులు తీసుకు రావడం వెనుక ప్రజల్ని మభ్య పెట్టడమే. ఇప్పుడు కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఇలాంటి చర్యకే ఉపక్రమించారు. జిల్లా కేంద్రం అభివృద్ధిలో ప్రత్యేకత చాటుకునేందుకు కొత్తగా నిధులు తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేస్తే ప్రజలు హర్షిస్తారు. అలా కాకుండా చీప్‌ట్రిక్స్ ప్లే చేయడం సరైన చర్య కాదు.

– రెడ్డి ప్రసాద్, 41వ డివిజన్ ఇన్‌చార్జి.

ఆగి ఉన్న కారును ఢీ కొన్న బైక్

ఇరువురికి గాయాలు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని నాలుగు రోడ్ల కూడలిలో శనివారం సాయంత్రం ఆగి ఉన్న మైదుకూరు తహసీల్దారు రాజసింహ నరేంద్ర కారును వెనక వైపున వేగంగా వస్తున్న బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో మైదుకూరుకు చెందిన మాబువల్లీ, అమీర్ బాషా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మైదుకూరు మండల తహసీల్దారు రాజసింహ నరేంద్ర ఒంటిమిట్ట లోని సీఎం చంద్రబాబు పర్యటన కార్యక్రమాన్ని ముగించుకుని ప్రొద్దుటూరుకు వెళుతూ చాపాడు వద్ద కారు ఆపుకుని ఉన్నారు. ఇదే సమయంలో ఆర్టీసీ బస్సును క్రాస్ చేస్తూ వేగంగా వెళుతున్న బైక్ ప్రమాదశాత్తు కారును ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైక్‌లో ఉన్న మాబువల్లీ, అమీర్ బాషాలు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనం అందుబాటులో లేకపోవటంతో తహసీల్దారు తన కారులోనే గాయపడిన వ్యక్తులను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ఫ్లెక్సీ కడుతుండగా ప్రమాదం

కడప అర్బన్ : కడప నగరంలోని సరోజిని నగర్‌కు చెందిన మూలతోటి కుమార్(55) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫ్లెక్సీ బ్యానర్ కూలీ పని చేస్తూ జీవనోపాధి సాగిస్తున్న మూలతోటి కుమార్ నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద చైన్నై షాపింగ్ మాల్‌కు చెందిన హోర్డింగ్ బ్యానర్‌ను షాపింగ్ మాల్ సమీపంలోని సమాధుల ప్రహరీ వద్ద కడుతుండగా విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సంఘటనపై చిన్నచౌక్ సీఐ ఓబులేసు, ఎస్ఐ ఎన్.రాజరాజేశ్వర్ రెడ్డి తమ సిబ్బందితో పరిశీలించి మృతుని కుమారుడు చరణ్‌తేజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలిస్తుండగా కుటుంబ సభ్యులు తీవ్రంగా విలపించి, ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీ హోర్డింగ్ కట్టే సమయంలో కార్మికునితో పాటు తగిన జాగ్రత్తలను తీసుకునేందుకు కాంట్రాక్టర్ గానీ, సూపర్‌వైజర్‌గానీ ముందుండాలని, అలాంటివేమీ తీసుకోకపోవడం వల్లనే కుమార్ మృత్యువాత పడ్డాడని తెలుస్తోంది. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తును సమగ్రంగా నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని మృతుని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



మూలతోటి కుమార్(ఫైల్), కుమార్ మృతదేహం

కత్తితో బెదిరించి గాజులు లాక్కెళ్లాడు

కొండాపురం : మండల కేంద్రంలో పట్టపగలు ఓ గుర్తు తెలియని వ్యక్తి గోరుశెట్టి రంగమ్మ అనే వృద్ధురాలిని కత్తితో బెదిరించి రెండు గాజులు లాక్కెళ్లాడు. ఎస్ఐ ఎం. ప్రతాప్‌రెడ్డి వివరాల మేరకు కొండాపురం ఎస్‌బీఐ ఆర్అండ్ఆర్ కాలనీలో గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి గుడ్డ కట్టుకొని రంగమ్మ అనే వృద్ధురాలి వద్దకు వెళ్లి కత్తితో ఆమెను బెదిరించాడు. దీంతో ఆమె చేతికి ఉన్న రెండు గాజులు తీసి ఇచ్చింది. అయితే అవి బంగారు గాజులు కావని రోల్డ్‌గోల్డ్‌వి అని వాటి విలువ రూ. 450 ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అట్లూరు : పొలం గట్లపై ఉన్న కంపను కాల్చేందుకు ఓ రైతు పెట్టిన నిప్పుతో మంటలు చెలరేగి పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల మేరకు మండల పరిధిలోని పాత అట్లూరు గ్రామ సమీపంలో ఉన్న ఇండియన్ గ్యాస్ గోడౌన్ సమీపంలో ఉన్న పొలాల గట్లపై ఉన్న ముళ్ల కంపను కాల్చేందుకు రైతు నిప్పు పెట్టారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో మంటలు ఎగిసి పడుతూ గ్యాస్ గోడౌన్ వైపు వ్యాపించాయి. గ్రామస్తులు అందరూ మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాక పోవడంతో బద్వేలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే అగ్ని మాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేయడంతో హమ్మయ్యా.. అంటూ గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బస్తాలు సీజ్

దువ్వూరు : దువ్వూరు మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బస్తాలను కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ప్రొద్దుటూరు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున ఆధ్వర్యంలో దాడులు చేసి సీజ్ చేశారు. మండలంలోని కానగూడూరు గ్రామం అంగన్‌వాడీ కేంద్రం పక్కన వాటర్ ట్యాంక్ వెనుక రేకుల షెడ్డులో కలరి సుబ్రహ్మణ్యం అక్రమంగా నిల్వ ఉంచిన 35 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశామని అధికారులు తెలిపారు. వీటి విలువ రూ.80,500 ఉంటుందన్నారు. బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌లో అప్పగించి కేసు నమోదు చేశామన్నారు. అలాగే పోతురాజు మహాలింగం దువ్వూరు అశోక్ నగర్ వీధిలో ఓ పాడుబడిన ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 65 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.1,71,580 అని చెప్పారు. తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరకు హోటళ్లకు అమ్ముతున్నారని అధికారులు తెలిపారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కమలాపురంలో చోరీ


దుండగులు తలుపు గడియ పగులగొట్టిన దృశ్యం

కమలాపురం : కమలాపురం పట్టణ పరిధిలోని కె.అప్పాయపల్లెలో చోరీ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అప్పాయపల్లెకు చెందిన బోయిళ్ల నాగమల్లారెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో ఉన్న తన కొడుకు వద్దకు వెళ్లారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని దుండగులు ఇంటి వాకిలికి ఉన్న గడియను పగుల గొట్టి లోనికి వెళ్లారు. ఇంట్లో ఉన్న బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న నగదు, బంగారు నగలు అపహరించుకుని వెళ్లినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం ఇరుగు పొరుగు వారు చూడగా తలుపు తెరిచి ఉండటంతో పాటు తలుపుకున్న గడియ పగులగొట్టడం చూసి పోలీసులకు సమాచారం అందించారు. కాగా పోలీసులు ఘటన జరిగిన ఇంటికి పరిశీలించారు. క్లూస్ టీం వస్తుందని పోలీసులు చెప్పడంతో ప్రజలు ఎవరూ ఇంట్లోకి వెళ్లలేదు. ఈ విషయంపై ఎస్ఐ విద్యా సాగర్‌ను వివరణ కోరగా బాధితులు హైదరాబాద్‌లో ఉన్నారని, వారు వచ్చి ఫిర్యాదు చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

నీట మునిగి ఉపాధ్యాయుడి మృతి

పీలేరు : తన కుమారుడికి ఈత నేర్పించడానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఉపాధ్యాయుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన పీలేరులో జరిగింది. నందకుమార్(50) అనే ఉపాధ్యాయుడు కేవీపల్లె మండలం మారెళ్ల పడమట పల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. శనివారం తన కుమారుడికి ఈత నేర్పించడానికి పట్టణ సమీపంలోని చెక్‌డ్యామ్ నీళ్లలోకి దిగారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి అక్కడే చనిపోయారు.

పౌరసరఫరాల రాష్ట్ర ఛైర్మన్ ఆకస్మిక తనిఖీ


సప్లైస్ స్టాక్ బఫర్‌గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న మెహర్ సీతారాం సుధీర్

కడప సెవెన్‌రోడ్స్ : పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర చైర్మన్ తోట మెహర్ సీతారాం సుధీర్ శనివారం కడప నగరంలోని సివిల్ సప్లైస్ స్టాక్ బఫర్‌గోడౌన్, ఎంఎల్ఎస్ పాయింట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడప డీఎం కార్యాలయంలో జిల్లా ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఇన్‌చార్జిలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు పరిశీలించి పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు .స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్ నుంచి స్టాక్ పాయింట్లకు లూజ్ బ్యాగులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోడౌన్లలో స్టాకింగ్ స్ప్రేయింగ్ సరిగా లేనందున తక్షణమే నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బోడపాటి శివదత్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి


ఏఎస్ఐ శంకర్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న ఎర్రగుంట్ల పాత్రికేయులు

ఎర్రగుంట్ల : పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఎర్రగుంట్ల పాత్రికేయులు అన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు మరో ఆరుగురు పాత్రికేయులపై డీజీపీ ఆదేశాల మేరకు తప్పుడు కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఎర్రగుంట్ల పట్టణంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల ఏఎస్ఐ శంకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతు పల్నాడు జిల్లా మాచర్లలో హరిశ్చంద్ర అనే వ్యక్తి హత్య కేసును బాధితుల కథనం మేరకు సాక్షి దినపత్రిలో ప్రచురించారని తెలిపారు. టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఎగ్జిక్యూటివ్ మెంబర్ వల్లెపు శ్రీనివాసులు, పాత్రికేయులు హబీబ్, జయంత్, లక్ష్మీనారాయణ, బాలాంజనేయులురెడ్డి, శ్రీనివాసులు, డాక్టర్ నారాయణ, రఘురాముడు తదితరులు పాల్గొన్నారు

ఎం.రాచపల్లి.. చిన్నారుల మృతితో తల్లడిల్లి..

చిట్వేలి : మండల పరిధిలోని ఎం.రాచపల్లిలో శుక్రవారం ముగ్గురు చిన్నారులు నీటి కుంటలో పడి మృతి చెందిన సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన చొక్కారాజు దేవాన్స్ (7) తండ్రి నరసింహారాజు, తల్లి చంద్రకళ. వీరికి ఇద్దరు కుమారులు కాగా దేవాన్స్ పెద్ద కుమారుడు. అలాగే చొక్కారాజు విజయ్ (7) తండ్రి శేఖర్ రాజు, తల్లి విజయలక్ష్మీ. వీరికి ముగ్గురు కుమారులు కాగా విజయ్ చిన్న కుమారుడు. అలాగే రెడ్డిచర్ల యశ్వంత్ (6) తండ్రి వెంకటేష్, తల్లి సుప్రజ. వీరికి ముగ్గురు కుమారులు కాగా యశ్వంత్ పెద్దకుమారుడు. విజయ్ తండ్రి శేఖర్ రాజు, యశ్వంత్ తండ్రి వెంకటేష్ ఇద్దరు జీవనోపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లి ఉన్నారు. సంఘటన జరగడంతో శనివారం స్వగ్రామం చేరుకొని కుమారుల మృతిని తట్టుకోలేక కన్నీటి పర్యంతమై కుప్పకూలిపోయారు. తల్లిదండ్రుల దుఃఖాన్ని చూసిన గ్రామస్తులంతా కంటతడి పెట్టారు. మృతులు యశ్వంత్, విజయ్ చిట్వేలిలో ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతుండగా దేవాన్స్ గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతునాడు. వీరి మృతితో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

గోపవరం : మండలంలోని పి.పి.కుంట సమీపంలో ఉన్న సెంచరీ పానెల్స్ పరిశ్రమ ఎదురుగా నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై శనివారం ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ నరసయ్య తీవ్రంగా గాయపడ్డాడు. బద్వేలు నుండి పి.పి.కుంట వైపు వెళుతున్న ట్రాక్టర్ సెంచరీ పానెల్స్ వద్ద ఉన్న పెట్రోలు బంకులో డీజిల్ పట్టించుకునేందుకు తిప్పుతుండగా అదే సమయంలో నెల్లూరు వైపు నుండి అతి వేగంగా వస్తున్న లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాదం జరిగిన వెంటనే తీవ్రంగా గాయపడిన నరసయ్యను ఆసుపత్రికి తరలించేందుకు గోపవరం అంబులెన్స్‌కు సమాచారమివ్వగా వాహనం మరమ్మతుకు నోచుకోవడంతో అందుబాటులోకి రాలేదు. అదే విధంగా బద్వేలు అంబులెన్స్ కూడా అందుబాటులోకి రాకపోవడంతో దాదాపు 30 నిమిషాల పాటు తీవ్రంగా గాయపడిన నరసయ్య రోడ్డు మీదనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంతలో సెంచరీ పానెల్స్ పరిశ్రమ అంబులెన్స్ ద్వారా తీవ్రంగా గాయపడిన నరసయ్యను బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లారు. కాగా పి.పి.కుంట, ప్రాజెక్టుకాలనీ-1, సెంచరీ పానెల్స్ పరిశ్రమ ఎదురుగా అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో అధిక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రాంతాన్ని ప్రమాద జోన్‌గా గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని పరిశ్రమ నిర్వాహకులతో పాటు వాహనదారులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. జరిగిన రోడ్డు ప్రమాదంపై బద్వేలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాద దృశ్యం

మద్యం దుష్ప్రభావాలపై అవగాహన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో మద్యం దుష్ప్రభావాల పట్ల ప్రజలలో అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయిలో కేర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. శనివారం నగర శివార్లలోని రిమ్స్‌లో డీ -అడిక్షన్ సెంటర్‌లో బాధితులకు మద్యం దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్య విముక్తి సమాజంగా మార్చడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ నాయక్, కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ కృష్ణకుమార్ వైద్య, సిబ్బంది పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వక్ఫ్ సవరణ చట్టంను పార్లమెంటు ఆమోదించడాన్ని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. శనివారం కడప నగరంలోని అజ్మత్ షాది ఖానాలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచనల ప్రకారం లౌకిక ప్రజాస్వామ్యవాదులతో రౌండ్ టేబుల్ సమావేశం అహ్మద్ బాబు బాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, చంద్ర, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు మతాల మధ్య విభజన పెంచి, దేశ లౌకిక స్వభావాన్ని, మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నాయన్నారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలపాలని నూతనంగా ఏర్పాటైన వక్ఫ్ పరిరక్షణ కమిటీ (జేఏసీ) తీర్మానించింది. కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్తార్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర నాయకుడు ఇషాక్ అలీ, ఎస్‌డీపీఐ నాయకుడు తాహీర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర తహీర్ మిగతా మండల వారీగా ఎన్నుకోవడం జరిగిందన్నారు, నగర కమిటీని ఎన్నుకున్నారు.


సంఘీభావం తెలుపుతున్న వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు